# శాస్త్రిగారు - శంకరవిలాసు

బ్రతకనేర్చినవారిలో శాస్త్రి ముఖ్యుడు. తలకాయలు మార్చే తెలివితేటలున్నా, గతిలేక గుమాస్తాగిరి వెళ్ళబోస్తున్నాడు పాపం! జీవనోపాధి నిర్విఘ్నంగా కొనసాగించుకునేందుకు బోలెడు తెలివి తేటలున్నయ్—

మనసులో మాట దాచుకోలేడు. అందరితోనూ నవ్వుతూ ప్రేలుతూ మాట్లాడే స్వభావం!

శాస్త్రి కాఫీప్రియుడు. కేవలం వో అరకప్పు కాఫీతో వాడిచేత ఎంతటిపనైనా చేయించుకోవచ్చు!

ఆఫీసుకు దగ్గర్లోనేవున్న 'శంకరవిలాసు' కాఫీహోటలుకు శాస్త్రి ఫౌండరనే చెప్పాలి! వాడొక్కడే కాకుండా,

---

సెప్టెంబరు '65 ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురితము

ఆఫీసులో ఉండే పరివారాన్నంతా వెంటేసు కెడతాడు వాళ్లె క్కడ ఏడ్చిపోతారోని !—

ప్రతిరోజు ఆఫీసుకు వచ్చింది మొదలు కాఫీ గిట్టుబాటు కోసం వాడికళ్ళు పార్టీలకోసం వెతకటం మొదటిఎత్తు. ఆఫీసు పని ప్రారంభించటం రెండో ఎత్తు.

అంతేగాదు. వాడి అభిమానితులందరితోను "తాగితే శంకరు విలాసులో కాపీనే తాగాలి !— కాలిస్తే చేబ్రోలు పొగాకే కాలవ్వాలి!-" అంటూ వో అరగంటసేపు ప్రతిరోజు హోటలు మెట్లమీదనుంచుని లెక్చెరు దంచటం శాస్త్రి అల వాటు.

మేమంతా శాస్త్రి తెలివి తేటలకు, సమయస్ఫూర్తికీ ఆశ్చర్యపోతూంటాం— కానీ, వాడు యవడిమీదనైనా 'కాఫీ యాస్త్రం' వేశాడా... అంతే.

ఈ భూవలయంలో శాస్త్రికి అత్యంత ప్రియమైన వస్తువులు రెండు. మొదటిది శంకరవిలాసు కాఫీ, రెండు చేబ్రోలు పుగాకు! ఈ రెంటినీ వాడికి సమర్పిస్తే యిక వాడినుండి పొందలేని సహాయమంటూ ఏదీ ఉండదు! అందుకే వాడిని మేమంతా అల్పసంతోషి అంటూఉంటాం.

శాస్త్రి ఏ విషయాన్ని గురించి మాట్లాడినా ప్రతి దాన్ని శంకర విలాసు కాఫీతోనే పోలుస్తాడు.

హోటలు శలవు రోజున కాఫీమైనా మానేస్తాడుగానీ, మరో హోటలుకు వెళ్ళేందుకు సుతరామూ యిష్టపడడు.

"ఒరే శాస్త్రి!— పోనీ ఈ గుమాస్తాపనికి స్వస్తిచెప్పి హాయిగా శంకర విలాసు హోటలుకు రిప్రజెంటేటివ్‌గా పని చేయరాదూ?—" అని మేమంతా ఏడిపించటం పరిపాటి.

శంకరవిలాసు, సర్వవేళ సర్వావస్థలయందు, జన బాహుళ్యంతో కిటకిట లాడుతూంటుంది.

క్రొత్తగా వచ్చిన తెలుగు సినీమాకైనా మొదటిరోజు మ్యాట్నీకి, టిక్కెట్లందు తాయేమోగాని... శంకర విలాసులో కూర్చుని కాఫీ తాగేందుకై సీటు మాత్రం దొరకదు.

శాస్త్రిల్లాంటి పర్మనెంటు ఖాతాదారులు కాఫీకోసం వచ్చినపుడు హోటలు మీదున్న అభిమానంకొద్దీ... లేక కాఫీ మీదవుండే వ్యామోహంతో నేగానీ లోపల కెళ్ళి, అట్లుబోసే పెనం దగ్గర నిల్చునైనా, ఆ కాసిన్ని వేణ్ణీళ్లూ గొంతులో పోసుకొని చక్కాబోతారు—

ఒకరోజున మేమంతా వూరుకోలేక "ఒరేశాస్త్రీ!... నీ పొగడ్తలకేంగానీ... ఆ హోటల్లో వోసారి కాఫీ అంటూ త్రాగితే... అసలు మనకు కాఫీమీదవుండే యిష్టతే పోతుంది. ఏమంటావు?" అన్నాం.

అతగాడి ప్రియతమ శంకరవిలాసుని అంతమాట అన్నందుకు వో రెండురోజులపాటు మాతో మాట్లాడం మానేశాడు.

శాస్త్రి ఆఫీసు దినచర్యలో అనేకమైన విచిత్ర సన్నివేశాలు కల్పబడుతూంటాయి!—

ఆరోజు సోమవారం—మేమంతా ఆఫీసులో యెవరి పని వాళ్ళం చేసుకుంటున్నాం.

ఫైళ్ళలో మునిగిపోయిన శాస్త్రికోసం వో పార్టీ వచ్చాడు.

"ఏం గావాలయ్యా నీకు ?" ఆతడ్ని చూడకుండానే ప్రశ్నించాడు శాస్త్రి.

"సార్! — శంకరువిలాసు శాస్త్రిగారు మీరేనా !"

"ఏం కూశావ్ ?" ఉగ్రుడయ్యాడు.

"అవునుసార్ ! వారిని కలుసుకోవాలి."

"నాపేరు శంకరవిలాసు శాస్త్రని చెప్పిన అప్రాచ్యు డెవరు ?"

"ఎవరోనండీ...! మెట్లదగ్గర గుమాస్తాని 'శాస్త్రి' గారు యెక్కడుంటారని అడిగితే...ఆ పేరుగలవాళ్లు చాలా మంది ఉన్నారూ!...నీకు సత్యం శాస్త్రి గావాలా ? నరహరి శాస్త్రికావాలా ? నారపశాస్త్రిగావాలా ? అంటూ వో పది పేర్లు చెప్పారండీ!— అవన్నీ విన్న నేను ... ఉద్యోగానికి దరఖాస్తులు తీసుకునే శాస్త్రిగారు కావాలన్నాను ... ... ఒహో—అయితే శంకరవిలాసు శాస్త్రి కావాలన్నమాట చెప్పవేం ?...అనేసి, తిన్నగా మేడమెట్లెక్కి వెడితే, తలుపు ప్రక్కనే మొదటిసీట్లో ఉంటారన్నారండీ !... అందుకని మీరవునో గాదోని అడిగాన్‌సార్ !—" అంటూ విన్నవించుకున్నాడు వచ్చిన పార్టీ.

"చాలు చాల్లేవయ్యా!... వచ్చిన వాడివి పనేదో చూచుకుని వెళ్ళక ... అనవసరపు మాటలూ!... అధిక ప్రసంగాలూ!..." అంటూ నయాపైసంత ముఖం చేసుకున్నాడు శాస్త్రి.

కొన్నాళ్లకు వాడి అసలుపేరు మరుగునపడిపోయి, 'శంకరవిలాసు' శాస్త్రిగా చెలామణి అవుతూ వచ్చాడు.

అతడి దగ్గరకు వచ్చిన యే పార్టీనీ వూరికే పోనివ్వడు. వచ్చిన పనేదో చెప్పుకోగానే, 'అయితే శంకరువిలాసు దగ్గర కలు' అనే సమాధానం వెంటనే వస్తుంది. అలా అనటం వాడి వాడుక భాష అయింది. అంటే వాడి ఆత్మారాముడిని కాఫీతో చల్లబుస్తేగానీ ... వాడిదగ్గరనుంచి సహాయమేమీ రాదు అనుకోవాలి.

"సరే శాస్త్రి! ఎందుకురా వాళ్లనలా కాఫీకోసం దేవురిస్తావ్?" అంటే 'ఏడిశాన్లెండోయ్! మనకొచ్చే ఈ చాలీ చాలని జీతాలతో హోటలు ఖర్చునుకూడా జతపరిస్తే ఇక యింటి దగ్గర వస్తే! చంద్రుడికో నూలుపోగన్నారు!... అలాగే మన ముఖాన అరకప్పు కాఫీ పోసినంత మాత్రాన వాడు చెడిపోయేదీలేదు ... మనం మేడలు కట్టేదీలేదు! ఇదంతా కేవలం జరుగుబాటుకోసమే" అంటాడు.

అందుకే వాడి సంగతి తెల్సినవాళ్లు ముందు వాడిని శంకరువిలాసులో కలుసుకునే, తర్వాత కార్యక్రమం చెప్పుకుంటారు.

చివరకు పోస్టుమాను కూడా శాస్త్రి ఆఫీసుకు సెలవు పెట్టినరోజున వాడి ఉత్తరాలను హోటలు ప్రొప్రయిటరుకిచ్చి వెడుతూంటాడు.

ఆదివారంరోజున ఆఫీసుకు శలవు కావటంతో వంటరిగానే హోటలు కెళ్లాడు.

హోటల్లో ఖాళీకప్పుల శబ్దం 'శంకర్ — జైకిషన్ల' మ్యూజిక్ ను గుర్తుకు తెస్తోంది.

"ఏమయ్యా !—వచ్చి కూర్చుని అరగంటైనా ఎవరూ రారేం ?—' అప్పుడే మంచినీళ్ళ గ్లాసులు తెచ్చి టేబిలుమీద పెడుతున్న సర్వరుమీద విసుక్కున్నాడు శాస్త్రి.

"మీకేంగావాలో చెప్పండీ ?—" గుడ్లురుముతూ విలన్ రాజనాలలాగ పోజుపెట్టాడు సర్వరు.

"చూడు మిష్టర్!...నువ్వీహోటలుకు క్రొత్తయినా నేను పాత వాడినే!...కాఫీ ఎక్స్ట్రా!" అన్నాడు.

"ఏమిటయ్యా? నువ్వు తాగే మాలావు అరకప్పు కాఫీ కోసం గొంతు చించుకుంటావ్!" అనేసి లోపలి కెళ్లాడు.

"వీడికింకా మన సంగతి తెలీదు గామోసు!' అంటూ లోలోపల గొణుక్కున్నాడు ఎక్కడ వింటాడోని.

శాస్త్రి పిరికితనానికి ప్రక్కనే కూర్చున్న వో లావు పాటాయన కేలంగిలా నవ్వేశాడు.

అప్పుడే హోటల్లోకి అడుగు పెట్టిన శీను "ఏరా శాస్త్రి? వంటరిగా వచ్చావ్?" అంటు భుజం తట్టాడు.

"ఆదివారం గదరా! ఇవ్వాళ అంతా సొంతం! అంటే చెల్లింపు అంతా మనకష్టార్జిత మన్నమాట! కూర్చో! నువ్వూ అరేసుకుందువు!" ఎదురుగావున్న ఖాళీ కుర్చీ చూపాడు శాస్త్రి.

వాళ్ళు మాట్లాడుకుంటున్న పరిభాష ఏమిటో, అర్థం కాని మరో పెద్దమనిషి తెల్లమొహం వేసుకుని శాస్త్రిని చూస్తూ ఉండిపోయాడు.

తెచ్చిన ఒక్క కాఫీని, ఇద్దరూ త్రాగటంతో బిల్లు ఎవరి కివ్వాలో అర్థంగాని సర్వరు, నీళ్ళ తడి చేసి యిద్దరికీ మధ్యగా ఉంచి వెళ్లాడు బిల్లును.

శాస్త్రి వోమారు బిల్లుకేసి తీక్షణంగా చూచేడు. బుర్రలో ఆలోచన మెరుపులా మెరిసింది!—

"ఒరే శీను ! నువ్విక్కడే ఉండు ! ... నేను మళ్ళీ యిప్పుడేవస్తా" అంటూ గబగబా లేచి చక్కా వెళ్లాడు శాస్త్రి, ఏదో మర్చిపోయిన వాడికిమల్లే.

మళ్లీ వస్తాననేసి చెప్పి వెళ్ళినశాస్త్రి యెంతకీ తిరిగి రాకపోవటంతో హోటల్లో కూర్చోవటం విసుగనిపించిన శీను బిల్లు కౌంటరులో యిచ్చి బైటికొచ్చాడు.

"ఏరా శీనూ... ఇంతసేపూ యేం చేస్తున్నట్లులోపల!" చుట్ట చుట్టుకుంటున్న శాస్త్రి పలుకరించాడు.

"అఘోరించినట్టేవుంది! నీ కోసం చూచీ చూచి యిప్పుడే బైటికొచ్చేను."

"మరీ... బిల్లు...?"

"ఇచ్చాన్లేవోయ్ !"

"హమ్మయ్య !" గట్టిగా వూపిరిపీల్చాడు శాస్త్రి.

అతడలా అర్థాంతరంగా వెళ్ళిపోవటంలో గల ఉద్దేశ్యాన్ని అర్థంచేసుకున్న శీను 'ఒరే శాస్త్రి ! నీకదేం... పోయే కాలంరా ?— యెంతసేపటికీ ఎదుటి వాడి నెత్తిన చెయ్యి బెట్టాలనే ?'

"ఏం చేయను బ్రదర్—వెధవది... అలవాటయింది."

"నువ్వు పర్మినెంటు మెంబరువుగదా ! నీ పేరన హోటల్లో ఖాతా అయినా పెట్టరాదూ ? ఇలాంటి అవుసర సమయాల్లోనైనా పనికొస్తుందీ."

"కొద్దిరోజులు వోపిక పట్టరా నాన్నా !... అసలు హోటలునే కొనేస్తాను."

"ఏడిశావులే!... అలా వెళ్దాం పద!—"

ఇద్దరూ ఏదో పనిమీద వెళ్ళారు!—

నెలాఖరురోజుల్లో శాస్త్రికి పనెక్కువగా ఉంటుంది ఆఫీసులో. క్షణం తీరికుండదు! వచ్చే పోయే పార్టీలకు సమాధానం చెప్పలేక విసిగిపోతాడు! పది నిమిషాలకోమారు పిలచే ఆఫీసర్ల ధాటీకి తట్టుకోలేక సతమతమవుతూంటాడు!

మధ్యాహ్నం వంటిగంటయింది !

తలవంచుకుని ఏదో వ్రాసుకుంటున్నాడు శాస్త్రి.

"శాస్త్రీ !' ఎవరో పిల్చినట్టనిపించింది.

"శంకర విలాసు దగ్గర కలు!" వంచినతల ఎత్తకుండానే సమాధాన మిచ్చాడు.

"శాస్త్రిగారూ..." మళ్లీ అదేకంఠం ధ్వనించింది.

"శంకరవిలాసు దగ్గర కలు."

"మిష్టర్ శాస్త్రీ"

"అబ్బ! శంకరవిలాసులో కలవయ్యా" అని విసుక్కుంటూ తల ప్రక్కకు తిప్పాడు.

వళ్లంతా చెమటలు పట్టినయ్. నోట మాట రాలేదు. మనిషి వణికిపోతూ "క్షమించండిసార్!... పొరపాటయింది. మీరని అనుకోలేదు."

"చూడుశాస్త్రీ పొరపాటుగాదు నీకిది అలవాటయింది." అధికారస్వరంతో ఆఫీసరు గద్దించాడు.

"క్షమించండిసార్"

"మిస్టర్ శాస్త్రీ వో అరకప్పు కాఫీ నీకు శంకరవిలాసులో యిప్పించినంతమాత్రంలో నువ్వు ఆఫీసుపన్లు చేసిపెడుతున్నావని నా కెన్నో రోజులనుండి రిపోర్టులు వస్తున్నాయి. కానీ నే నమ్మలేదు. ఈరోజు నేను కళ్లతో స్వయంగా చూడటం తటస్థించింది. ఇక నీ సంజాయిషీతో పన్లేదు.

పార్టీలవద్దనుంచి మనం ఏ రూపంలో లాభాన్ని పొందినా అది లంచంక్రిందకే వస్తుంది. అందుకని నిన్ను ఉద్యోగంనుండి "డిస్మిస్" చేస్తున్నాను. ఇక నువెళ్లచ్చు" అంటూ ఆఫీసరు చెప్పదల్చుకున్న నాలుగుముక్కలూ చెప్పేసి చక్కాబోయాడు.

పిచ్చెక్కినట్టయింది శాస్త్రికి. ఏం చేయాలో తోచలేదు. తన కిలాంటిపరిస్థితి వస్తుందని ఎప్పుడూ వూహించనైనా లేదు.

గత్యంతరంలేక చివరకు, కొన్నాళ్లకు, అప్పుతెచ్చిన కొద్ది పెట్టుబడితో శంకరవిలాసు హోటల్లో పార్టనరుగా చేరాడు శాస్త్రి. ఉద్యోగంకంటే వ్యాపారమే హాయిగా ఉందనిపిస్తోంది. ఉద్యోగం వూడటంకూడా బాగానే ఉన్న దన్పించింది. డబ్బు ఖర్చుకాకుండా రోజుకు పదిసార్లు కాఫీ తాగొచ్చని సంతోషించాడు.

ఆఫీసుప్రభువున్న వచ్చినప్పుడల్లా స్పెషల్ కాఫీ చేయించి యిచ్చేవాడు. ఒకరోజున ఆఫీసరే కాఫీ తాగేందుకై వచ్చాడు.

"ఒరే! అయ్యగారికి మాంచి కాఫీపట్రా" శాస్త్రి కౌంటరులోంచి కేకేశాడు.

"ఏమోయ్ శాస్త్రీ! వ్యాపారం చేస్తున్నావటగా?"

"అవునుసార్! ఏదో మీదయవల్ల... ఈరోజువరకూ హాయిగావుంది. అంతా మీ చలవే."

"ఏదైనా మనమేలుకే అన్నారు పెద్దలు" అంటూ కాఫీ తాగటం ముగించి డబ్బులివ్వబోయారు.

"వద్దులెండిసార్!"

"అదేమిటోయ్!...యిలా యెరిగినవారందరిక్ష్ పూరికే కాఫీయిస్తే...యిహ నీ వ్యాపారం సాగినట్టే!" అనేసిడబ్బిచ్చి వెళ్ళిపోయారు.

వ్యాపారం మూడు పూవులు, ఆరు కాయలుగా సాగుతోంది! హోటలు వ్యాపారంలో వూహించని లాభాలు గడిస్తున్నాడు శాస్త్రి.

స్వంతంగా మేడ కట్టించాడు. కారొకటి కొన్నాడు! గుమాస్తా ఉద్యోగంలో యిలాంటి సంపాదన, ఆనందం ఎక్కడి నుంచి వస్తాయనుకున్నాడు—తెలివి తేటలుంటే హోటలు వ్యాపారంకన్నా "మంచి బిజినెస్" లేదనే నిర్ణయించుకున్నాడు

కాష్ దగ్గర ఫాను, ప్రక్కనే ఫోను, ఆఫీసరుకంటే ఎక్కువ హోదాలో ఉన్నట్టు ఫీలవుతున్నాడు—తన కింతటి అదృష్టం కలుగ జేసిన ఆఫీసరుకు, ఆ ఏడుకొండుల వాడికీ ప్రతి నిత్యం మనసులో నమస్కారం చేస్తూ వస్తున్నాడు.

వచ్చేపోయే స్నేహితులతో "ఉద్యోగంలో మజా ఏముందోయ్? సత్తావుంటే నువ్వూ ఒక హోటలు పెట్టి చూడు! నీకూ నా అంతటి అదృష్టం పడుతుంది! స్వానుభవ మున చాటు నా సందేశమిదియే!" అంటూ సలహా యిచ్చే వాడు శాస్త్రి.

రోజులు గడుస్తున్నాయి!

అవి ముందు వేసవి రోజులు...

అనుకోనట్టుగా వో రోజు మధ్యాహ్నం హోటలు వెనుక భాగానికి నిప్పంటుకుంది! ఫైరింజన్లు వచ్చేలోపుగానే హోటలు నేలమట్టమైంది!

నెత్తీ, నోరు మొత్తుకున్న శాస్త్రికి నోట మాట రాలేదు!

'కెవ్వున' కేకేశాడు శాస్త్రి డిటెక్టివు సినీమాలో హంతకుడ్ని చూచిన అబల అరచినట్టు.

శాస్త్రి అరుపుకు ఆఫీసుగదంతా దద్దరిల్లింది.

చుట్టూవున్న ఫ్రెండ్సు నిద్రావస్థలోవున్న శాస్త్రిని తట్టి లేపుతూ 'ఏమిట్రా శాస్త్రీ అలా అరిచావ్? పగటిపూటే కలవరిస్తున్నావా ఏమిటీ కొంపదీసి?' అన్నారు.

చెమటలు పట్టిన ముఖాన్ని తుడుచుకుంటున్న శాస్త్రి నిద్రావస్థ నుండి మేలుకుని, 'అవున్రా! నా శంకరవిలాసు హోటలుమీద పీడకల వచ్చిందిరా! అంటూ జ్ఞాపకమున్నంత వరకు విషయాన్నంతా పూసగుచ్చినట్టు ఫ్రెండ్సందరితోనూ చెప్పాడు.

'ఒరే బాబూ!... మధ్యాహ్నంపూట 'లీషర్' టైంలో పడుకుని కునుకు తీసేది చాలక ... యిలాంటి కలలు కంటున్నా వేమిట్రా పిచ్చితండ్రీ!' అంటూ పెద్ద పెట్టున నవ్వారు శాస్త్రి అమాయక హృదయాన్ని చూచి.

ఆఫీసు గోడ గడియారం ఒంటిగంటన్నర చూపింది!